# నవ్వితే నవ్వండి

నవ్వితే నవ్వండి మాకభ్యంతరం లేదన్నారు బాపూ రమణగార్లు.

'అయ్యా! ఈ నవయవ్వన గుళికలు వేసుకుంటే నా పింఛనుకేమీ ఇబ్బంది రాదు కదా!' అంటాడు ఓ ముసలాయన.

'ఇవిగో మీకు ఈ రెండు మాత్రలూ ఇస్తున్నాను. ఒకటి పోడుకోబోయే ముందు వేసుకోండి. పొద్దున్నే లేస్తే రెండోది వేసుకోండి' అంటాడు వైకుంఠయాత్రా స్పెషల్ డాక్టర్.

ఒక కవిగారి భార్య అంది 'మా ఆయన రామాయణం వ్రాస్తున్నారు' అని. పక్కింటావిడ సానుభూతి చూపిస్తూ అంటుంది 'కొనుక్కుంటే పోదుటమ్మా మళ్ళీ వ్రాయటం దేనికి' అని.

ఆ పుస్తకం మొదటి పేజీలోనే 'ఈ పుస్తకంలో అట్టహాసంనించి మంద హాసందాకా ఎన్నో జోకులున్నాయి. అవి దేశవిదేశాల్లో అందర్నీ నవ్వించిన జోకులు. మీరు నవ్వకపోతే అవి చిన్నబుచ్చుకుంటాయనీ, బుక్కుని బుకాయించాలని గడుసుగా అట్టహాసం వచ్చే చోట నిభాయించుకుని మందహాసం చేసి వూరుకుంటే అది మోస పోదనీకూడా వ్రాశారు. వాటిల్లో స్వగ్రామం, స్వదేశం మరిచిపోయిన జోకులుకూడా వున్నాయని వ్రాశారు. దేశవిదేశాల్లో అంటే దేశీ జోకులు విదేశాల్లో బాగా నవ్వించా యనా లేక విదేశీ జోకులు భారతీయం చేయబడ్డాయనా? ఇక్కడికి వచ్చాక దేశవిదేశీ జోకులు ఎక్కువ చదువుతున్నానేమో, వీటి మీద చిన్న పరిశీలన మొదలు పెట్టాను.

మనకి తెనాలి రామకృష్ణుడి మీద ఎన్నో జోకులున్నాయి. అందులోనూ నాకు తెలుగు సాహిత్యం మీద ఎంతో అభిమానం కనుక అవన్నీ ఉత్సాహంగా చదివే వాడిని, ఆనందించేవాడిని. అదే హాస్యం రామకృషుడి బదులు చాల వరకూ బీర్బల్ చెప్పినట్టుగా తరువాత అక్బర్, బీర్బల్ కథలు చదువుతుంటే మళ్ళీ కనపడేది.

ఒకరోజు అక్బర్‌కీ బీర్బల్‌కీ వాదన జరిగింది. ఫలితాలు ఎలావున్నా ఎప్పుడూ నిజమే చెప్పాలి అబద్ధం చెప్పకూడదంటాడు అక్బర్. 'కాదు. ఒక్కొక్కప్పుడు అబద్ధం చెప్పి తప్పించుకోవటమే ఉత్తమం' అంటాడు బీర్బల్. చివరికి అక్బర్ ఒప్పుకోకపోవ టంతో, ఎప్పుడో ఒకరోజు నిరూపిస్తాను చూడండి అంటాడు బీర్బల్. ఒకరోజు అక్బర్ తోటలో గులాబీ మొక్క దగ్గర వంగుని పువ్వు కోస్తుంటే, బీర్బల్ వెనకనించీ వెళ్ళి ఆయన్ని కావలించుకుని ముద్దు పెట్టు కుంటాడు. అక్బర్ ఆశ్చర్యంతో చూస్తుంటే, బీర్బల్ తలవంచుకుంటాడు. అలా ఎందుకు చేశావని అక్బర్ అడిగితే 'నిజుచెప్పి తల కొట్టించుకోమంటారా అబద్ధం చెప్పి మీకూ నాకూ ఇబ్బంది లేకుండా చేయమం టారా' అని అడుగుతాడు బీర్బల్. అక్బర్ అంతకుముందు జరిగిన వాదనని గుర్తు చేస్తూ, 'అప్పుడే చెప్పానుగా నిజమే చెప్పాలని. అలా అయితే అవతలివారు అర్థం చేసుకుని క్షమించే అవకాశం వుంది' అంటాడు. దానికి బీర్బల్ భయపడుతూ 'అయితే నిజమే చెబుతాను ప్రభూ! మీరనుకోలేదు రాణీగారనుకుని ఆ పని చేశాను'

అంటాడు. అతను చెప్పింది నిజంగా నిజం కాదనీ, తను చెప్పిందానికి అలా సమాధానం చెబుతున్నాడనీ అతని చతురతని చూసి అక్బర్ బీర్బల్ని క్షమించాడుట.

ఇలా ఎన్నో హాస్య కథలు ఎక్కడో పుట్టి, గాలి వీచిన ప్రతి చోటుకూ వెడుతూ మన దగ్గరికీ వచ్చాయి. వస్తున్నాయి. అందులోనూ ఇప్పుడు ఇంటర్నెట్ వారు సైబర్ స్పేస్‌లో సూపర్ హైవేలు కట్టాక, అవి గాలికంటా వేగంగా మన దగ్గరికి వస్తున్నాయి.

బ్రబీదేవి చనిపోయి యమధర్మరాజు దగ్గరికి వెళ్ళిందిట. అక్కడ ఎన్నో గోడ గడియారాలు వున్నాయిట. ఒక గడియారంలో ముళ్ళు కదలకుండా అలాగే వున్నాయిట. 'అదేమిటి ముళ్ళు తిరగటంలేదు' అని అడిగింది. 'అవా! అవి అబద్ధాలు చూపించే గడియారాలు. అది మహాత్మా గాంధీగారిది. ఆయనెప్పుడూ అబద్ధాలు చెప్పలేదు. అందుకే ముళ్ళు కదలటం లేదు' అన్నాడు. 'మరి పక్కది?' 'అదా! దాంట్లో ముళ్ళు ఒకే ఒక్కసారి తిరిగాయి. అది లాల్ బహదూర్ శాస్త్రిగారిది. ఆయన చిన్నప్పుడు ఒక అబద్ధం చెప్పాడుట' అన్నాడు. 'మరి ఫానులా గిరగిరా తిరుగుతున్న గడియారమో' అడిగింది బ్రబీ. 'అదా! మీ ఆయన లాలూప్రసాద్‌ది. ఆయన చెప్పే అబద్ధాలకి అలా ఆగకుండా తిరుగుతున్నది' అన్నాడు. ఇది మన దేశీ హాస్యం. ఇదే జోకు హిల్లరీ, బిల్ క్లింటన్‌ల మీద అమెరికాలో ప్రచారంలో వుంది.

ఏమిటండీ బలబీర్‌సింగ్‌గారూ! తడిసిపోయిన చొక్కా వేసుకున్నారంటే, దీని మీద వాష్ అండ్ వేర్ అని వుంది. ఆరేయమని లేదు మరి!' అన్నాడు. ఇంకానయం ఆరేసుకోబోతే పారేసుకుంటానేమోనని ఆరేసుకోలేదు అంటాడేమో అనుకున్నాను.

'ఏమండీ ఉత్తమ్‌సింగ్! ఏమిటి ఆ ఉత్తరం అంత నెమ్మదిగా వ్రాస్తున్నారు' అని అడిగాడు ఉత్తినే అటు వెడుతున్న ఉద్ధంసింగ్. 'ఏం లేదు. మా అమ్మకి. ఆవిడ గబగబా చదవలేదు. అందుకని నెమ్మదిగా వ్రాస్తున్నాను మరి' అన్నాడు సర్దార్జీ.

ఇవి మన సర్దార్జీ జోకులు. టెక్సాస్‌లో యాగ్గీస్ అని టెక్సాస్ ఎ అండ్ ఎం అనే యూనివర్సిటీ వాళ్ళని పిలుస్తారు. మన సర్దార్జీల మీద లాగానే వాళ్ళ మీదా అవే జోకులు వున్నాయి. అంతే కాదు అలాటి జోకులే ఐరిష్ వారి మీదా, స్కాటిష్ వారి మీదా, ఇంగ్లీష్‌వారు వేస్తుంటారు. అలాగే యూరోపియన్స్ పొలిష్ వారి మీద కూడా - నూటికి నూరు పాళ్ళు - అవే జోకులు వేస్తుంటారు. అంతేకాదు. రాగి జుట్టు వున్న ఆడవాళ్ళ (బ్లాండ్) మీద కూడా అలాటి జోకులే వున్నాయి. అలాగే చైనీస్ మీద జపనీస్ మళ్ళీ అవే జోకులు వేస్తుంటారు. రష్యన్ల మీదా ఆ జోకులు వున్నాయి. నిజంగా మన సర్దార్జీలు, యాగ్గీలు, పోలిష్ వారూ... బుర్రలు లేని వారు కాదు. ఎవరి మీదో వేయాలి కాబట్టి అలా ఎవరినో బలి చేస్తుంటారు అంతే.

ఇవన్నీ పరిశీలిస్తుంటే, ఒక చోట పేలిన జోకుని అదొక రైటులా (అంటే హక్కులా) కాపీరైటుని ఉల్లంఘించి కాపీ కొట్టినా రైటుగా కాపీ కొట్టి, సార్వజనీనం చేస్తున్న జనులని అభినందించాలి. అందుకే అలాటి జోకులు దేశ విదేశాలు తిరిగి అన్ని రకాల మనుష్యులనీ అంతర్జాతీయ స్థాయిలో నవ్వించాయి. ఎవరు ఎవరి మీద జోకులేసుకున్నా, జోకులు జోకులే కనుక కొన్ని చెప్పుకుందాం. నవ్వితే నవ్వండి.

నవ్వకపోతే మీకే నష్టం. ఎందుకంటే అవి అన్ని దేశాల్లోనూ బాగా పేలిన జోకులు.

ఒక యాగ్గీ టెక్సాస్ లాటరీ టిక్కెట్టు కొన్నాట్ట ఒక డాలర్ పెట్టి. జాక్ పాట్ నలభై మిలియన్ల డాలర్లు. మర్నాడు పొద్దున్నే పేపర్లో చూస్తే అతని నెంబరుకే జాక్‌పాట్ వచ్చింది. లాటరీ ఆఫీసుకివెళ్ళి టిక్కెట్టు చూపించాడు. ఇన్‌కంటాక్స్ పధ్నాలుగు మిలియన్లు తీసుకుని, ఇరవై ఆరు మిలియన్లు ఇస్తామన్నారు. అతనికి బహు చెడ్డ కోపం వచ్చింది. మీరు నలభై మిలియన్లు అని వ్రాసి ఇరవై ఆరే ఇస్తారేమిటి అని దబాయించాడు. ఆవిడ ప్రతివాళ్ళూ టాక్స్ కట్టవలసిందే అని చెప్పింది. అయినా అతను వినలేదు. వాళ్ళ మేనేజర్ కూడా వచ్చి అతనికి అర్థమయేటట్టు చెప్పాడు. అతను కోపంతో ఇంకా రెచ్చిపోయాడు. తన టిక్కెట్టు తీసి వాళ్ళ ముఖం మీద విసిరేసి 'మీరు తక్కువ డబ్బులిస్తే తీసుకోటానికి నేనేం వెర్రివాడిని కాదు. మీ టిక్కెట్టు మీరే తీసుకుని, నా డాలర్ నాకిచ్చేయండి' అన్నాడు!

పోలిష్ వాళ్ళల్లో మూడు రకాల వాళ్ళు వున్నారు తెలుసా? ఒకటి - లెఖ్ఖ పెట్టటం వచ్చిన వాళ్ళు, ఇంకొకటి లెఖ్ఖ పెట్టటం రాని వాళ్ళు!

ఒక బ్లాండ్‌కి చెవికీ చెవికీ మధ్య ఏముందో తెలుసా? విండ్ టన్నెల్. మెరుపులు వస్తున్నప్పుడు బ్లాండ్ అమ్మాయి ఎందుకు నవ్వు ముఖం పెడుతుందో చెప్పండి? ఫ్లాష్ కెమెరాతో మీరు ఫొటో తీస్తున్నారని.

ఇద్దరు యాగ్గీలు వెడుతున్న చిన్న విమానం చెడిపోయి స్మశానంలో పడిపోయింది. ఇద్దరూ చనిపోయారు. శవాలు కనపడలేదు. మిగతా యాగ్గీలందరూ వచ్చి 700 శవాల్ని బయటికి తీశారుట!

మీకు వచ్చిన ఫాక్స్ ఒక సర్దార్జీ పంపించాడని మీకెలా తెలుస్తుంది? ఏముంది దాని మీద అంటించిన స్టాంప్ చూస్తే అదే తెలుస్తుంది! ఇద్దరు సర్దార్జీలు యమునా నదికి చెరో పక్కనా నుంచుని మాట్లాడుకుంటున్నారుట. జమునాసింగ్ అడిగాడుట 'నేను అటు పక్కకి రావాలంటే ఏం చేయాలీ' అని. యమునాసింగ్ నవ్వి 'భలే వాడివే! నువ్వు అటు పక్కనే ఉన్నావ్!' అన్నాడు.

ఇద్దరు పోలిష్‌వాళ్ళు ఒక పోల్‌ని, అంటే కర్రని, నిఠారుగా నిలబెట్టి పట్టుకున్నారు. ఇంకో పోల్ (పోలిష్‌వాడు) పోల్ (కర్ర) పైకి పాకుతున్నాడు. పక్కనే పోతున్న పోలయ్య అడిగాడు 'ఏం చేస్తున్నారూ' అని. 'మేమా! ఇది ఎంత ఎత్తుందో కొలుస్తున్నాం' అన్నాడు ఒక పోలన్న. 'దాన్ని కింద పడుకోబెట్టి కొలవటం సులభం కదూ' అన్నాడు పోలయ్య. పోలిగాడు, 'ఆమాత్రం అర్థం చేసుకోవూ. మేము కొలుస్తున్నది దీని ఎత్తు. పొడుగు కాదు పోలయ్యా!' అన్నాడు.

ఒక టింగ్ రంగారావు చైనా వెళ్ళినప్పుడు ఆయనకో అనుమానం వచ్చింది. 'మాదేశంలో పేర్లకి అర్థంవుంటుంది. మరి మీ పేర్లకి అలా వుంటుందా' అని అడిగాడు. 'పిల్లాడు పుట్టగానే గచ్చునేల మీదకి రెండు స్టీలు చెంచాలని ఎగరేస్తాం. అవి క్రింద పడ్డప్పుడు చింగ్, పింగ్, టింగ్ అంటాయి కదా, ఆ శబ్దాలే మా పేర్లు' మన టింగ్ వేపు చూస్తూ అన్నాడు చెంగ్.

నవ్వితే నవ్వండి నా కభ్యంతరం లేదు!